# మంత్రులు వర్సెస్ ఎమ్మెల్యేలు

మొదటిపేజీ తరువాయి...

ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పార్టీ ఎమ్మెల్యేలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా, మెజార్టీ ఎమ్మెల్యేలు గ్రామసభల నిర్వహణ, అర్హుల ఎంపికపై ప్రశ్నల వర్షం కురిపించినట్టు సమాచారం. సొంత పార్టీ ఎమ్మెల్యేలే ప్రతిపక్ష ఎమ్మెల్యేల మాదిరిగా ప్రశ్నలు సంధించినట్టు తెలిసింది. దీంతో విసుగుచెందిన మంత్రి ఉత్తమ్ 'ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాలను పక్కనపెట్టండి.. మీకు ఇష్టం వచ్చినట్టు చేయండి' అంటూ ఎమ్మెల్యేలకు చెప్పినట్టు సమాచారం. ఒక్క ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాత్రమే కాదు.. దాదాపు మంత్రులందరి పరిస్థితి ఇదే విధంగా ఉన్నది. ప్రతిచోటా మంత్రులను నిలదీస్తున్నట్టు తెలిసింది. 'దావోస్, ఢిల్లీ, బెంగళూరు తిరుగుతూ మీరంతా బాగానే ఉన్నారు.. మీరు పెట్టిన పెంటకు క్షేత్రస్థాయిలో మేం బలవుతున్నాం' అంటూ ఒక ఎమ్మెల్యే ఘాటుగానే వ్యాఖ్యానించినట్టు తెలిసింది. 'పరిస్థితి ఎంత దారుణంగా ఉన్నదో వచ్చి చూడండి' అని సదరు ఎమ్మెల్యే కోపంగా అన్నట్టు సమాచారం.

### గ్రామసభలు, దరఖాస్తులెందుకు?

గ్రామసభల ద్వారా అర్హులను ఎంపిక చేయాలన్న ప్రభుత్వ ఆలోచన బెడిసికొట్టింది. ప్రచారం కోసం ప్రయత్నిస్తే.. అది రివర్స్ వ్యతిరేకత పెంచుతున్నది. అర్హుల పేర్లు జాబితాలో ఉండటం లేదు. దీంతో ప్రజలు అధికారులను, కాంగ్రెస్ కార్యకర్తలను, ఎమ్మెల్యేలను నిలదీస్తున్నారు. గ్రామసభలన్నీ రణరంగాన్ని తలపిస్తున్నాయి. ఈ సెగ ఎమ్మెల్యేలకు తాకింది. ప్రజలు, కార్యకర్తల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతుండటంతో ఎమ్మెల్యేలంతా ఫ్రస్ట్రేషన్‌కు గురవుతున్నట్టు తెలిసింది. గ్రామసభలు ఎందుకు పెడుతున్నరు? మళ్లీ మళ్లీ దరఖాస్తులు ఎందుకు తీసుకుంటున్నరు? అంటూ సొంత ప్రభుత్వ తీరుపైనే అసంతృప్తి వ్యక్తంచేస్తున్నట్టు సమాచారం. ప్రజాపాలనలో దరఖాస్తులు, కుటుంబ సర్వేలో తీసుకున్న వివరాలు ఏమయ్యాయంటూ నిలదీస్తున్నారు. గత వివరాల ప్రకారం అర్హులకు ఎంపిక చేసి పథకాలు అమలు చేస్తే బాగుండేదని, సభలు, దరఖాస్తుల పేరుతో రచ్చకు తెరతీశారంటూ ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఇదంతా తమ కొంప ముంచేందుకేనంటూ అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు.

### మీ ఇష్టమేనా.. ఇక మేమెందుకు?

ఇందిరమ్మ ఇండ్లు, ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డుల జారీకి సంబంధించి అర్హుల ఎంపిక ప్రక్రియ మొత్తం హైదరాబాద్ నుంచే కొనసాగుతున్నది. ప్రజాపాలన, కులగణనలో సేకరించిన వివరాలతో సాంకేతికత ఆధారంగా అర్హుల జాబితాను రూపొందించి క్షేత్రస్థాయికి పంపిస్తున్నారు. ఈ జాబితాను గ్రామసభలో పెట్టి మరోసారి అర్హులను గుర్తిస్తున్నారు. అంతేగాని గ్రామసభల్లో కొత్త జాబితాను రూపొందించే, కొత్తవారిని చేర్చే అవకాశం లేదు. ఎమ్మెల్యేలకు కూడా ఈ అధికారం లేదు. దీంతో ఎమ్మెల్యేలు అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారు. 'పథకాలు ఎవరికివ్వాలో మీరే తేల్చితే ఇక మేమెందుకు? పథకాల అమలు మీ ఇష్ట ప్రకారమే జరిగితే మేం ఎమ్మెల్యేలుగా ఉండి ఎందుకు? పార్టీ కోసం పనిచేసినవారికి, కార్యకర్తలకు, మా వద్దకు వచ్చే నిరుపేదలకు కూడా సహాయం చేయలేకపోతున్నాం. ఎవరికీ మేలు చేయనప్పుడు మేము ఎమ్మెల్యేలుగా ఉండెందుకు, ఈ పదవి ఎందుకు?' అంటూ ఎమ్మెల్యేలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ముఖ్యంగా కార్యకర్తలకు మొఖం చూపించుకోలేకపోతున్నామని ఎమ్మెల్యేలు ఆవేదన వ్యక్తంచేస్తున్నట్టు తెలిసింది.

### ఇలా అయితే.. సర్పంచ్ ఎన్నికల్లో కష్టమే!

పథకాల అమలు కోసం ప్రభుత్వం అనుసరిస్తున్న విధానంపై సొంత పార్టీ ఎమ్మెల్యేలే తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. పథకాలిచ్చి ప్రయోజనం పొందాల్సిందిపోయి, వ్యతిరేకత మూటగట్టుకుంటున్నామని, దీంతో త్వరలో జరిగే సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో ఈ వ్యతిరేకత ప్రభావం చూపడం పక్కా అని చెప్తున్నారు. జాబితాల్లో తప్పులతో అర్హులకు అన్యాయం జరుగుతున్నదని మండిపడుతున్నారు. దరఖాస్తులు, వడపోతలతో ప్రజలు ప్రభుత్వంపై ఆగ్రహంతో ఉన్నారని, ప్రభుత్వం అనుసరిస్తున్న అస్తవ్యస్థ విధానాలతో సొంత పార్టీ కార్యకర్తలకు కూడా న్యాయం జరగడం లేదని వాపోతున్నారు. ఎన్నో ఏండ్లుగా పార్టీ కోసం పనిచేసినవారికి కనీసం రేషన్‌కార్డు కూడా ఇప్పించుకోలేని పరిస్థితి నెలకొన్నదని ఎమ్మెల్యేలు అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు.

# గ్రామసభకు ఇంతమంది పోలీసులా?

- ప్రజలను కొట్టి సంపుతరా ఏంది?
- ఎన్నిసార్లు దరఖాస్తులు పెట్టాలె?
- హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి నిలదీత
- జమ్మికుంట మండలం సైదాబాద్ గ్రామసభలో బైఠాయింపు
- అధికారులకు గులాబీ పూలు అందించి వినతి


కరీంనగర్ జిల్లా సైదాబాద్‌లో అధికారులకు దండం పెడుతున్న హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

జమ్మికుంట, జనవరి 23 : 'గ్రామ సభకు ఇంత మంది పోలీసులెందుకు? కొట్టి సంపుతరా ఏంది? కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలు నెరవేర్చాల్సిందే. పథకాల కోసం ఎన్నిసార్లు దరఖాస్తులు పెట్టుకోవాలో చెప్పండి. పథకాలు అమలయ్యేంత వరకు ప్రజల గొంతుకనవుతా. ప్రశ్నిస్తూనే ఉంటా. ఎన్ని కేసులు పెడతారో.. పెట్టుకోండి. హామీలన్నీ నెరవేరేదాకా నిద్రపోను. మిమ్మల్ని నిద్రపోనియ్య. మీకు దండం పెడుతున్నా.. అర్హులందరికీ పథకాలు ఇయ్యండి' అంటూ హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అధికారులకు విజ్ఞప్తి చేశారు. కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం సైదాబాద్‌లో గురువారం గ్రామసభను నిర్వహించారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి వస్తున్నారనే సమాచారం మేరకు డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్సైలు, సిబ్బందితోపాటు ప్రత్యేక బలగాలు బందోబస్తు నిర్వహించాయి. ఎమ్మెల్యే రాగానే అధికారులు సభను ప్రారంభించారు. పలు పథకాలకు దరఖాస్తు చేసుకున్న వారిలో ఎంపికైన పేర్ల జాబితాను చదివి వినిపించారు. వెంటనే స్థానికులు ఒక్కసారిగా లేచి, అర్హులకు పథకాలు ఎందుకియ్యడం లేదని ప్రశ్నించారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అప్పటివరకు స్టేజీ మీద ఉన్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి.. ప్రజల మధ్యకు వెళ్లారు. వాళ్ల మధ్య కూర్చుని సమస్యలు తెలుసుకున్నారు. దరఖాస్తులను పరిశీలించారు. అర్హుల పేర్లు ఎందుకు జాబితాలో లేవో చెప్పాలని అధికారులను ప్రశ్నించారు. ప్రజలు అధికారులను అడిగేందుకు ముందుకు రాకుండా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఎమ్మెల్యే కుర్చీ నుంచి దిగి కింద కూర్చున్నారు. అర్హులైన అందరికీ పథకాలు అమలు చేయాలని గులాబీ పూలు అందిస్తూ వినూత్న తరహాలో నిరసన తెలిపారు. పథకాల అమలు నిరంతర ప్రక్రియ అని, పూర్తిస్థాయిలో పథకాలు అమలు కోసం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని అధికారులు హామీ ఇచ్చారు. దీంతో ఎమ్మెల్యే వెళ్లిపోయారు.

### చల్లూరులో 150 మంది పోలీసులు

వీణవంక మండలం చల్లూరు గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రామసభకు సుమారు 150 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి స్థానిక నాయకులతో కలిసి వస్తున్నారనే సమాచారంతో మునుపెన్నడూ లేనివిధంగా పోలీసులు మోహరించడంతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు.

# దరఖాస్తు... మళ్లీ.. మళ్లీ!

- ఆరు గ్యారెంటీలకు అరడజనుసార్లు దరఖాస్తులు
- ఏడాదికాలంగా ఇదే తంతు.. లబ్ధిదారుల బేజారు
- పదే పదే దరఖాస్తుల స్వీకరణపై ప్రజల ఆగ్రహం
- ప్రజాపాలన దరఖాస్తులు ఏమయ్యాయని నిలదీత

హైదరాబాద్, జనవరి 22 (నమస్తే తెలంగాణ): దరఖాస్తు.. దరఖాస్తు.. కాంగ్రెస్ సర్కారులో 'దరఖాస్తు' ఊతపదంగా మారిపోయింది. గతంలో తీసుకున్న దరఖాస్తులు ఏమయ్యాయో చెప్పకుండా మళ్లీమళ్లీ దరఖాస్తులు తీసుకుంటూ హంగామా చేస్తున్నది. ప్రజాపాలన దరఖాస్తులతో మొదలైన ప్రక్రియ ఏడాదికాలంగా కొనసాగుతూనే ఉన్నది. దరఖాస్తు చేసుకున్నా ఆ పథకం వస్తుందన్న నమ్మకం కూడా లేదంటూ నిట్టూరుస్తున్నారు.

### 6 గ్యారెంటీలు.. అరడజనుసార్లు దరఖాస్తులు

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలుకు ఇప్పటివరకు అరడజనుసార్లు దరఖాస్తులు స్వీకరించింది. అధికారంలోకి రాగానే డిసెంబర్ 28న ప్రజాపాలన పేరుతో రాష్ట్రవ్యాప్తంగా దరఖాస్తులు స్వీకరించింది. ఆ తర్వాత మళ్లీ ఎంపీడీవో ఆఫీసుల్లో రూ.500లకే గ్యాస్ కోసం, గృహజ్యోతి కోసం దరఖాస్తులు తీసుకున్నారు. ఆ తర్వాత రుణమాఫీ కోసం దరఖాస్తులు(ఫిర్యాదులు) స్వీకరించింది. పథకాల అమలు కోసం కులాల వారీగా లెక్క తీస్తామని ప్రకటించిన సర్కారు.. నిరుడు నవంబర్ 9 నుంచి రాష్ట్రవ్యాప్తంగా కులగణన చేపట్టింది. ఈ నివేదిక ఆధారంగా పథకాలు అమలు చేస్తామని మంత్రులు ప్రకటించారు.

### పాత దరఖాస్తులు ఏమయ్యాయి?

గ్రామసభల ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని చెప్పడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇంతకుముందు దరఖాస్తులు ఏమయ్యాయంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రజాపాలన దరఖాస్తులను సంక్షేమ పథకాల్లో అర్హుల ఎంపికకు ప్రామాణికంగా తీసుకుంటామని ప్రభుత్వం గత ఏడాది ప్రకటించింది. సంక్షేమ ఫలాలు అందుతాయని కోటి ఆశలతో ప్రజలు దరఖాస్తు చేసుకున్నారు. మహాలక్ష్మి, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, చేయూత పథకాల కోసం అందులోనే దరఖాస్తు చేసుకోవాలని కోరడంతో సుమారు 1.2 కోట్ల మంది దరఖాస్తు చేసుకున్నారు. ఆ తర్వాత 1.17 కోట్ల కుటుంబాల కులగణన సర్వే చేయించింది. ఈ వివరాలతో ఆయా పథకాలకు అర్హులను ఎంపిక చేయవచ్చు. మళ్లీ కొత్తగా దరఖాస్తులు తీసుకోవాల్సిన అవసరం ఏమిటనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

### కాలయాపన.. కోతలకే... కొత్త దరఖాస్తులా ?

కాంగ్రెస్ సర్కారు ఏ పథకం అమలు చేసినా అందులో కోతలు, కొర్రీలే ఎక్కువగా ఉంటున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. మళ్లీమళ్లీ దరఖాస్తులు తీసుకోవడం వెనుక కోతలు పెట్టడమే లక్ష్యంగా ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మళ్లీమళ్లీ దరఖాస్తు చేసుకొనేందుకు చాలామంది వెనుకంజ వేస్తారు. పథకాల అమలును జాప్యం చేయడానికి దరఖాస్తుల స్వీకరణ పేరుతో కాలం గడిపే యొచ్చన్నది ప్రభుత్వం ఎత్తుగడ కావచ్చని అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

# గ్రామసభల పేరుతో మరో మోసం

- అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు
- రాబోయే ఎన్నికల్లో భంగపాటు తప్పదు
- బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆర్ఎస్‌పీ


అలంపూర్‌లో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేత ఆర్ఎస్పీ. చిత్రంలో ఎమ్మెల్యే విజయుడు

అలంపూర్, జనవరి 23 : రేవంత్ సర్కారు ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను మోసం చేసిందని, గ్రామసభల పేరుతో మరోసారి దగా చేయాలని యత్నిస్తున్నదని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు ఆగ్రహం వ్యక్తంచేశారు. గురువారం గద్వాల జిల్లా అలంపూర్‌లో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రజలను మోసం చేయడమే సిద్ధాంతంగా పెట్టుకున్న కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని చెప్పారు. రాష్ట్రంలో దుష్టపాలన సాగుతున్నదని, రాబో యే ఎన్నికల్లో భంగపాటు తప్పదని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ హెచ్చరించారు. అధికార పార్టీ నాయకులు గ్రామ సభల వేదికలపై కూర్చోవడం రాజ్యాంగ విరుద్ధమని చెప్పారు. అర్హులందరికీ న్యాయం చేస్తామని జనగణన చేసి, ఇప్పుడేమో గ్రామసభలు పెట్టి దరఖాస్తులు స్వీకరిస్తున్నారని దుయ్యబట్టారు.

# ఆరు గ్యారెంటీలే కాంగ్రెస్ పతనానికి నాంది

### బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి



ఆర్మూర్‌టౌన్, జనవరి 23: అమలు కాని 6 గ్యారెంటీలే కాంగ్రెస్ ప్రభుత్వ పతనానికి నాంది అని బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి విమర్శించారు. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డుల మంజూరు పే రుతో నిర్వహిస్తున్న గ్రామసభల్లో ప్రజల తిరుగుబాటు కాంగ్రెస్ ప్రజా వ్యతిరేక పాలనకు నిదర్శనమని తెలిపారు. ఇండ్లు ఎప్పుడు కట్టిస్తారంటూ ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డిపై మ హిళలు తిరగబడ్డారని, భువనగిరి ఎమ్మెల్యేను ఉరికిచ్చి కొట్టారని గు ర్తుచేశారు. స్థానిక ఎన్నికల్లో హీరో కావాలని మోసాలకు పాల్పడుతున్న కాంగ్రెస్ జీరో కాక తప్పదని తెలిపారు.

మరిన్ని వార్తలు ntnews.com లో చూడగలరు

**ఎయిర్‌పోర్ట్స్ ఎకనామిక్ రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా**
(భారత ప్రభుత్వ చట్టబద్ధమైన సంస్థ)
3వ అంతస్తు, ఉడాన్ భవన్, సఫ్దార్‌జంగ్ ఎయిర్‌పోర్ట్, న్యూఢిల్లీ-110003,
ఫోన్: 24695044-47, ఫ్యాక్స్: 24695048, వెబ్‌సైట్: http://aera.gov.in

ప్రకటన
**అడ్వకేట్/లా ఫార్మ్ యొక్క ఎంప్యానెల్‌మెంట్**

భారతదేశంలోని గౌరవనీయ సర్వోన్నత న్యాయస్థానం, ఉన్నత న్యాయస్థానం, ట్రిబ్యునల్ మరియు ఇతర న్యాయస్థానాల సమక్షంలో AERA తరపున కోర్టు కేసులను వాదించడానికి అర్హతగల అడ్వకేట్స్/ లా ఫార్మ్స్ నుండి ఎయిర్‌పోర్ట్స్ ఎకనామిక్ రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (AERA) దరఖాస్తులు కోరుతోంది.
అర్హత ప్రమాణాలు, నియమ నిబంధనలు మరియు అడ్వకేట్స్/ లా ఫార్మ్స్ ఎంప్యానెల్‌మెంట్ కొరకు రుసుము షెడ్యూల్ గురించిన వివరాలు AERA వెబ్‌సైట్ అనగా http://aera.gov.inలో లభిస్తాయి. ఏదేని సవరణ AERA వెబ్‌సైట్ లో మాత్రమే ప్రచురించబడును.
F.No.AERA/Legal/Empanelment of Advocates/LawFirm 2020/2023-24, తేది: 08-03-2024 ద్వారా వెబ్‌సైట్‌లో జారీచేయబడిన నోటీస్ ఉపసంహరించుకోబడినది మరియు దానియొక్క ప్రారంభించబడిన ప్రక్రియ పరిపాలనా కారణాల వలన రద్దు చేయబడినది. కాబట్టి పైన పేర్కొన్న 08-03-2024 తేదీనాటి నోటీస్‌కు ప్రతిస్పందనగా దరఖాస్తు చేసుకున్న అడ్వకేట్స్/లా ఫార్మ్స్ కూడా కొత్తగా దరఖాస్తు చేసుకోవలెను మరియు స్వీకరించబడిన వారి ఇంతకుముందు దరఖాస్తు ఈ నోటీస్ క్రింద ఎంప్యానెల్‌మెంట్ కొరకు పరిగణించబడదు.
అర్హత గల మరియు ఆసక్తి గల అడ్వకేట్/ లా ఫార్మ్ న్యూస్ అండ్ అనౌన్స్‌మెంట్ సెక్షన్‌లో AERA వెబ్‌సైట్‌లో ఏర్పాటు చేయబడిన లింక్‌ను ఉపయోగించి వారి దరఖాస్తు ఫారంను దాఖలు చేయవచ్చును.
ఈ పోర్టల్ ద్వారా దాఖలు చేయబడిన ఆన్‌లైన్ దరఖాస్తు మాత్రమే అనుమతించబడును మరియు ఎలాంటి ఇతర విధానం లేదా చానెల్ ద్వారా దరఖాస్తు దాఖలు అనుమతించబడదు.
ఆన్‌లైన్ దరఖాస్తు ఫారం దాఖలుకు చివరి తేది: 11-02-2025.

సం/ -
డిప్యూటీ చీఫ్, AERA
CBC 03112/12/0014/2425

